ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 28 మే, 2025 | పేజీలు : 06

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కట్టుమల్లు గౌడ్ తెలియజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రఘునాథపల్లి పోలీసుల ఆధ్వర్యంలో జాగృతి కళాబృందం వారు యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ వారి పాటలతో ప్రజలకు వివరించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడుపరాదని, జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్ఐ దిలీప్, హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్లు కుమారస్వామి, కిరణ్, జాగృతి కళాబృందం సభ్యులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇచ్చిన అసైన్‌మెంట్ పట్టా రద్దు చేయాలి

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** అక్రమంగా ఇచ్చిన అసైన్‌మెంట్ పట్టా రద్దు చేయాలని, కాస్తులో ఉన్న పేదలకు పట్టాలివ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటాపూర్ మండల కేంద్రంలోని జవహర్‌నగర్ గ్రామ శివారులో ప్రభుత్వం ఒక్క కుటుంబానికి 26 ఎకరాల 34 గుంటల అసైన్‌మెంట్ పట్టా 1995లో ఇచ్చారని, ఈ వ్యక్తి ఆ మండలం సంబంధించిన కుటుంబం కాదని, ఇట్టి భూమి 1995లో అడవితో కూడుకుంది. అలాంటి భూమికి రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. 2025లో పట్టాదారు వారి భూమి ఎక్కడో తెలవని పరిస్థితి ఉంది. 1873 సర్వే నెంబర్లు నాలుగు ఎకరాల పట్టా ఉంటే హైకోర్టుకు పోయి సర్వే ఆర్డర్ తెచ్చుకొని భూమి సర్వే చేయించుకుంటున్నాడంటే వారి భూమి ఎక్కడో వారికే తెలియదని అర్థమవుతుంది. అలాంటి పట్టాలు రద్దు చేసి అలాంటి పట్టాలు మండలంలో లక్ష్మీ దేవిపేట నుండి జవహర్‌నగర్ వరకు వందల మందికి ఇలాంటి అక్రమ అసైన్‌పట్టాలు ఇచ్చారు. భూమాత వచ్చింది కనుక మండలంలో రెవెన్యూ అధికారులు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని సర్వే చేస్తున్నారు. మండలంలో అన్ని గ్రామాలలో కాస్తులో ఉన్న పేద రైతులందరికి సర్వే చేసి వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జవహర్‌నగర్‌లో 26 ఎకరాల 30 గుంటల భూమిని కూడా రెవెన్యూ అధికారులు పరిశీలించి పేద రైతులకు న్యాయం చేయాలని అక్రమ అసైన్ పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగవెల్లి సత్యనారాయణ, సరసాని రవీందర్, గూడూరు సదాశివరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం



### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర చాలా కీలకమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం వరంగల్ దేశాయిపేటలోని సికెఎం కళాశాలలో లైసెన్స్ సర్వేయర్‌లకు సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజు భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నోటిఫికేషన్ జారీ చేసి, వారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాలో 315 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు సోమవారం నుంచి 50 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అనుభజ్ఞులైన రిటైర్డ్ సర్వేయర్లు థియరీతో పాటు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారినే సర్వేయర్లుగా నియమిస్తామన్నారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించిన సర్వే ఎఫ్ లైన్ వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు చెందిన గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారం కోసం నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్‌లు చేసిన భూ సర్వేను ప్రభుత్వ సర్వేయర్‌లు పరిశీలన చేసి, మ్యాప్ రూపొందిస్తారని కలెక్టర్ అన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం ఎంపిక చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అభ్యర్థులకుశిక్షణ మెటీరియల్ కిట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, పర్యవేక్షకులు అబూతల్హా, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి చరిత్రలోనే తొలిసారి

### పశ్చిమ ఎమ్మెల్యే తనిఖీల్లో వెలుగుచూసిన నిర్లక్ష్యం
### చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు..
### స్పందించిన కలెక్టర్..
### నిర్లక్ష్యపు ఉద్యోగులకు మెమోలు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ఎంజిఎం వైద్యులు, ఉద్యోగులపై కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అనుమతులు లేకుండా విధులకు హాజరుకాకపోవడం లాంటి చర్యలకు పాల్పడిన 77 మందికి మెమోలు జారీ చేశారు. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్‌ఎం ఇనుగాల వెంకట్రాం రెడ్డి ఎంజిఎంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యులు విధులకు హాజరుకాకపోవడం, శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతేకాదు.. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు. వెంటనే కలెక్టర్ స్పందించి కలెక్టర్ విధులకు హాజరుకాని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగుల నుంచి వివరణ కోరుతూ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంజిఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ ప్రాథమిక విచారణ జరిపి రిజిస్టర్లో సంతకాలు చేయని వైద్యులు, ఉద్యోగులతో పాటుగా విధులకు హాజరుకాని వైద్యులు, ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఈ ఘటన ఎంజిఎం చరిత్రలో ఓ ఒక్క రికార్డును నెలకొల్పింది. ఒకే రోజు 77 మందికి మెమోలు జారీ చేయడం ఇప్పటి వరకు జరగలేదని, ఇంత మందిపై చర్యలు తీసుకోవడం ఇదే ప్రథమమని ఎంజిఎం ఉద్యోగులు గుసగుసలు పెట్టుకుంటున్నారు.

### నాణ్యమైన విత్తనాలు, ఎరువులు

# అందుబాటులో ఉండాలి


2లో

# భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** గౌరవెల్లి ప్రాజెక్ట్, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గౌరవెల్లి ప్రాజెక్ట్, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హై వే భూసేకరణ ప్రక్రియ పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో గౌరవెల్లి ప్రాజెక్టు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ గురించి హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, పరకాల నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ ప్రక్రియ పురోగతి పై పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూసేకరణ మొదటి దశ లో గుర్తించిన రైతులకు జూన్ 30నాటికి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో రైల్వే శాఖకు అందించాల్సిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. భూసేకరణ అయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈ చైతన్య, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు విజయ లక్ష్మీ, జ్యోతివరలక్ష్మి దేవి, జగన్ మోహన్ రెడ్డి, బావ్ సింగ్, సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

### సుబేదారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సుబేదారి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి అన్నారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనయుడు దివంగత నాయిని విశాల్ పేరిట ప్రతి ఏటా నిర్వహించే క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నాయిని యువసేన ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ కు సీఐ పి.సత్యనారాయణ రెడ్డిహాజరై టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సుబేదారి సిఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ..క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు.పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు.క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు .యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో ప్రయాణించి తల్లిదండ్రులు గర్వించే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటగాళ్లతో పాటు నిర్వాహకులు,నాయిని యువసేన టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకం వచ్చేలా కృషి చేయాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకం వచ్చేలా కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆద్వర్యంలో కలెక్టరేట్‌లో గల బీసీ అభివృద్ధి అదికారి బి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం కోసం అప్లికేషన్ చేసుకున్న వారందరికీ సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా లబ్దిదారులకు పథకాన్ని అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు కొత్త ఇంద్రారెడ్డి, పద్మం ప్రవీణ్ మాట్లాడుతూ భారతదేశానికి మొదటి ప్రధాన మంత్రిగా సేవలు అందించారని, ఎస్టి, ఎస్సి మైనార్టీ, బిసి వెనుకబడిన కులాలను అభివృద్ధి బాటలో నిడిపించిన మహోన్నత వ్యక్తి జవహర్‌లాల్ నెహ్రూ అని కొనియాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఎస్సి, ఎస్టి, ఆదివాసులపై అనేక దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. నెహ్రూ ఆశయాలను మళ్ళీ కొనసాగించాలంటే మంచిపాలన అందించాలంటే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే నెహ్రూ ఆశయాలు మళ్లీ ముందుకు తీసుకువెళ్లొచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉ పాధ్యక్షులు నీరుటి లక్ష్మి నారాయణ, మహబూబాబాద్ మాజీ కౌన్సిలర్ పోతురాజు, ఎండి అరుణ్, తేజావత్ శంకర్, గుగులోత్ నరేష్, సిరిపురం వీరన్న, యండి గఫురబోడ రాజు, ఆకుల శ్రీను,ఆలేటి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా 49వ డివిజన్ విద్యుత్ నగర్ రోడ్డు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ హనుమకొండ హంటర్ రోడ్డు నేషనల్ మార్ట్ విద్యుత్ నగర్‌లోని మూన్ మార్ట్ (సూపర్ మార్కెట్ ఎదురుగా) రోడ్డుపై నీళ్ల నిలవడం వల్ల నడి రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడడంతో అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఇద్దరు టూ వీలర్ పై వెళుతుండగా గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, 49వ స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోయినట్లు స్థానికులు చెప్పారు. వర్షం పడితే ఈ ప్రాంతంలో కనీసం రెండు రోజుల వరకు నీరు రోడ్డుపై నిలుస్తుందని వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం సైడ్ కాలువల నిర్మాణం లేకపోవడం రోడ్డుపైనే వరద నీరు నిలుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు గాని, ఆర్ అండ్ బి అధికారులు గాని తక్షణమే స్పందించి ప్రమాదాలు జరగకుండా వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు అంటున్నారు.

## ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టి మాయం

### అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

**ప్రజాపక్షం/ధర్మసాగర్:** అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు అక్కమ వ్యాపారులు ప్రభుత్వ భూముల్లో నుండి మట్టిని వదలడం లేదు.ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడా పడితే అక్కడ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.హనుమకోండ జిల్లా ధర్మసాగర్ మండలములోని ఎల్కుర్తి గ్రామములోని ప్రభుత్వ సర్వేనెంబర్ 160లో దాదాపు 50ఎకారాల్లో రాత్రివేళల్లో లారీల కోద్ది మట్టిని తరలించి సోమ్ము చేసుకుంటున్నారు.మండల కేంద్రానికి సమీపంలోని పలు వెంచర్లలో ఇక్కడి నుంచి మట్టి రవాణా చేస్తున్నారు.ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతూ.లారీల్లో ట్రాక్టర్లతో హన్మకోండ వరంగల్ శివారు ప్రాంతాల్లోని రియల్ వెంచర్లకు తరలిస్తు వ్యాపారులు లక్షలు సోమ్ముచేసుకోని ప్రభుత్వ అదాయానికి గండి కోడుతున్నారు.మట్టి మాఫియాపై ప్రభుత్వ ఆధికారులు పోలీస్‌లు చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.ప్రమాదకరంగా మారిన గుంతలు: ఎల్కుర్తి గ్రామముల్లో సర్వేనెంబర్ 160 ప్రభుత్వ భూమిలో మట్టి మాఫియా కొంత కాలం నుండి మట్టిని తరలించడంతో ప్రమాదకరంగా గుంతలు ఏర్పడడంతో వర్షకాల సమయంలో గుతల్లో నీరు చేరి ఎల్కుర్తి గ్రామం ఊరికి దగ్గర ఉండడంతో రైతులకు గ్రాస్తులకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు మట్టి మాఫియపై చయ్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉండాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసేందుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరిపోను విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో అందుబాటులో ఉంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్స్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్కులను కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాములో నిల్వ చేసి ఉన్న విత్తనాలు, ఎరువులు, మందులను కలెక్టర్ పరిశీలించారు. ఈపాస్ మిషన్ వినియోగం గురించి విత్తన, ఎరువుల దుకాణాదారులను అడిగి తెలుసుకున్నారు. దుకాణాలలో విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలకు సంబంధించిన స్టాక్ బోర్డులను పరిశీలించారు. పత్తి విత్తన ప్యాకెట్లకు ఉన్న లేబుల్స్ ను పరిశీలించారు. అదేవిధంగా పత్తి విత్తనాలకు సంబంధించి ఎన్ని రకాలు నిల్వ ఉన్నాయి, ఏ రకం ఎక్కువగా విక్రయిస్తున్నారనే వివరాలను దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పంటల సాగులో సస్యరక్షణ చర్యలకు డ్రోన్ల ద్వారా నానో యూరియాను చల్లే విధంగా రైతులను ప్రోత్సహించాలని దుకాణదారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మండల వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలను విజయవంతంగా నిర్వహిద్దాం

### జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ వై. వి. గణేష్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ వై. వి. గణేష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోనే కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ వై వి గణేష్ మాట్లాడుతూ జూన్ రెండో తేదీన నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. వేడుకల ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం పరిశీలన

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**ప్రజాపక్షం/గణపురం:**గణపురం మండలంలోని బస్వా రాజుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్. సివిల్ సప్లై అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం మూలంగా ఈ సెంటర్ లో భారీగా ధాన్యం తడిచి మొలకెత్తిందని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని ఈ సెంటర్ కు వచ్చినట్లు తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. రైతులు అధైర్య పడద్దని సకాలంలో లారీలు తెప్పించి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు ఎవరైనా రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు

# పురాతన ఎల్లమ్మ విగ్రహాన్ని మహంకాళి విగ్రహంగా తప్పుడు ప్రచారం

దేవత విగ్రహాన్ని శిల్పులు నిర్ధారణ చేసే వరకు గుడి నిర్మాణం ఆపాలి

తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** హసన్ పర్తి గ్రామం 66 డివిజన్ పరిధిలో మెయిన్ రోడ్డు ను ఆనుకొని గాంధీ చౌక్ సెంటర్ దగ్గర పురాతన కాలం నాటి గుడి శిథిలం కాగా ఆ గుడి పునర్ నిర్మాణం చేస్తూ ఆ గుడి లో వాస్తవంగా అమ్మవారి తల పైన నాగుపాము పడగ, ఒక చేతిలో దమరుకం, ఒక చేతిలో కుంకుమ భరణి, ఒక చేతిలో కత్తి, ఒక చేతిలో శులం ధరించి స్పష్టంగా రేణుక ఎల్లమ్మ దేవత రూపంలో ఉన్నప్పటికీ గ్రామం లోని కొంతమంది పెద్దలు ఇది రేణుక ఎల్లమ్మ విగ్రహం కాదు మహంకాళి విగ్రహం అని దానికి మహంకాళి గుడి గా నామకరణం చేస్తూ గుడి నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకొన్న తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్ ఈ రోజు నిర్మాణంలో ఉన్న గుడిని సందర్శించి అక్కడ ఉన్న విగ్రహాన్ని పరిశీలించి ఈ విగ్రహం ఖచ్చితంగా రేణుక ఎల్లమ్మ విగ్రహం అనే నిర్ధారణ చేయడం జరిగింది. అనంతరం యాదగిరి గౌడ్ మాట్లాడుతూ ఆ విగ్రహానికి రేణుక





ఎల్లమ్మ దేవతకు ఉండవలసిన అన్ని రూపాలు ఉన్నవి అని, ఇక్కడ గ్రామ పెద్దలు మరియు స్థానిక కార్పొరేటర్ కావాలని గౌడ కులస్థులను కించపరిచే విదంగా వ్యవహరిస్తూ గౌడ కులస్థుల కుల దైవం అయినా రేణుక ఎల్లమ్మ దేవతను వక్రీకరించడం జరుగుతుందని అన్నారు. ఇక్కడ ఉన్న విగ్రహాన్ని పురా వాస్తుశాఖ, దేవత విగ్రహాలు చేసే శిల్పులచే నిర్ధారణ చెయ్యంచాలని అప్పటి వరకు గుడి నిర్మాణం ఆపాలని లేని పక్షంలో రాష్ట్ర, జిల్లా గౌడ సంఘంల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తులో ఆందోళన చేపట్టుతాం అని, చట్ట పరంగా కూడా తాము ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘము రాష్ట్ర కన్వీనర్ జనగాం శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల లక్ష్మ ణ్ గౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంతుల రమేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పులి మోహన్ గౌడ్, వల్లాల జగన్ గౌడ్ పాల్గొన్నారు.

# అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రంలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న ప్రసాదం దాతలుగా మారం శ్రీనివాస్, అల్లాడి వెంకటేశ్వర్లు, నంగునూరు మధు, రామగిరి నాగరాజు, చెన్నూరి వెంకటేశ్వర్లు, మంతెన విద్యాసాగర్, పుస్కూరి రాము ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాలలోకెల్లా అన్న దానం గొప్పదన్నారు. ప్రతి నెలా అమావాస్య నాడు మండల కేంద్రంలో ఈ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్, దిలీప్, పోతన రావు, వాసవి, సాయి, పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన దామెర మహేందర్ ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధుల బృందం మంగళవారం పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఆ కుటుంబానికి స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు బిర్రు సోమేశ్వర్, కేశవరావు, మదార్, మల్లేష్, రాజు, పురుషోత్తం, రాజు, వెంకటేశ్వర్లు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మరో పోరాటానికి కమ్యూనిస్టులు సన్నద్ధం కావాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్



**ప్రజాపక్షం/మరిపెడ:**స్వాతంత్ర్యం వచ్చి75ఏళ్ళుపూర్తిచేసుకున్నా నేటికీ కార్మిక, కర్షక,విద్యార్థి,యువజన సమస్యలతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలు పరిష్కారం కాలేదని, వాటి పరిష్కారానికి మరో పోరాటానికి కమ్యూనిస్టులు సన్నదం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ పిలుపునిచ్చారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో జరుగుతున్న రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం జాతీయ సాయుధ పోరాటం అంశంపై మూడవ రోజు క్లాసును బోధించారు. క్లాసుల ప్రిన్సిపాల్ అల్వాల వీరయ్య అధ్యక్షలన జరిగిన ఈ శిక్షణా శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ మనకంటే వెనకాల స్వాతంత్ర్యం వచ్చిన చైనా నేడు ప్రపంచ దేశాలకు సవాలు చేస్తూ అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంటే మనం అమెరికాను చూసి భయపడుతున్నామన్నారు.ఈ దేవంలో కులం, మతం ప్రాంతం మధ్య తేడాలను చూపుతూ దేశ సంపద పెట్టుబడిదారులకు దారాదత్తం చేస్తున్నపాకలకులు అమెరికాకు అడుగులకు మడులొత్తుతున్నారని ఆయన ఆరోపించారు. స్వాతంత్ర్యోద్యమం నుంచి అనేక ప్రజా సంఘాల పేరుతో ప్రజలకు సేవలు చేస్తూ కమ్యూనిస్టు పార్టీలు ముందున్నాయన్నారు. వీరతెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికే ఓ మైలురాయిగా మిగిలిందన్నారు. ఈదేశంలో ఆర్థిక సామాజిక రాజకీయ సమస్యలు పరిష్కారం అవ్వడానికి కమ్యూనిస్టు పోరాటాలే ఏకైక మార్గమని రానున్న కాలంలో కమ్యూనిస్టు కార్యకర్తలు ఈ పోరాటంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలతో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, కుంట ఉపేందర్, కందనూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి గుండగాని మధుసూథన్, నాయకులు బానాల రాజన్న, దుండి వీరన్న, బోడపట్ల రాజశేఖర్,కందాల రమేష్, కొండ ఉప్పలయ్య, దొంతు మమత తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిజెపిని గెలిపించుకోవాలి

బిజెపి రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** బీజేపీ వరంగల్ సంస్థాగత సమావేశం జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన ధర్మారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులును, ప్రజాప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిదులను, మండల అధ్యక్షులను ఉద్దేశించి భవిష్యత్ పార్టీ కార్యాచరణ కార్యక్రమాలను రాబోవు స్థానిక ఎన్నికల్లో విజయం దిశగా ఏ విధంగా కృషి చేయాలో, బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతీ ఇంటికి చేరే విధంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, ఆరూరి రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, వన్నాల వెంకటనారాయణ, నర్సంపేట ఎమ్మెల్యే కంటెస్టెంట్ కంభంపాటి పుల్లారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మోర్చా పదాధికారులు బైరి మురళీకృష్ణ, బన్న ప్రభాకర్, గోకికార్ అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# శాయంపేటలో పట్టుబడ్డ గంజాయి స్మగ్లర్...



**ప్రజాపక్షం / శాయంపేట :** వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని ప్రశ్నించి తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి లభించినట్లు సీఐ రంజిత్ రావు తెలిపారు. వివరాల్లో కి వెళ్తే హన్మకొండ జిల్లా శాయంపేట మండలం మందారిపేట స్టేజ్ వద్ద శాయంపేట సబ్ ఇన్స్పెక్టర్ పరమేష్ తో పాటు పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన షారుక్ అనే వ్యక్తి అనుమానస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి విచారించాంగా అతని వద్ద 6 కిలోల గంజాయి పట్టుపడ్డట్లు సీఐ రంజిత్ రావు పేర్కొన్నారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రాపూర్ జిల్లా భల్లాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ షారుక్ ఓరిస్సా రాష్ట్రం చెందిన జీతేంద్ర కుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసుకుని అమకాలు జరుపు తునట్లు విచారణలో నిందితుడు తెలిపినట్లు సీఐ రంజిత్ రావు తెలిపారు. కేసు నమోదు చేసుకొని షారుక్ ను రిమాండ్ కు పంపినట్లు పేర్కొన్నారు. గంజాయి ని పట్టుకున్న ఎస్ ఐ పరమేష్ తో పాటు పోలీసులను సీఐ రంజిత్ రావు ప్రశంసించారు.

# మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి

అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:**మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు బారిన పడకుండా చూడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ములుగు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని పేర్కొన్నారు. కళాశాలలు, వివిధ వసతి గృహాలను సందర్శించాలని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పెడదోవ పట్టకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేయాలని తెలిపారు. రానున్న రోజుల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రగ్స్ నిర్ధారణ కిట్లను తెప్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకున్న చర్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బిడిఎస్ బి కిషోర్, మాదకద్రవ్య ఎస్ఐ సురేష్, డిఎంహెచ్ఓ గోపాల్‌రావు, సూపరింటెండెంట్ ఏహెచ్‌సి హాస్పటల్, బిసి డెవలప్‌మెంట్ ఆఫీసర్, బిసి డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఎస్‌సి డెవలప్‌మెంట్ ఆఫీసర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా నిషేధం, ఎక్సైజ్ ఆఫీసర్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగాభవానీ జాతర

**ప్రజాపక్షం/మరిపెడ:**మరిపెడ మండలం తాళ్ళ ఊకల్ గ్రామంలో యాదవ కులస్తులు అత్యంత వైభవంగా జరుపుకునే శ్రీశ్రీ గంగాభవాని జాతర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో యాదవ కులస్థులు సాంప్రదాయబద్దంగా ప్రతి సంవత్సరం దేవాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి యాదవ పూజారుల ఆధ్వర్యంలో మూడు రోజులు జాతర ఉత్సవాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ జాతకు గ్రామస్థులే కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీ ఎత్తున తరలివస్తారు. జాతర చివరిరోజు మంగళవారం గ్రామంలోని యాదవ కులస్థులు బోనాలు చెలించి, జంతుబలి ఇచ్చి సాంప్రదాయ నృత్యాలతో గంగాభవానిని వేడుకుంటారు. గ్రామస్థులు బంధుగణాన్ని ఆహ్వానించి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో యాదవ కుల పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

### సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి అబ్బాస్



**ప్రజాపక్షం/దేవరుప్పుల:**ముందస్తు వర్షాలతో కొనుగోళ్ల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు లేక రైతులకు పత్తి విత్తనాలు ఎరువులు అందుబాటులో లేక రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి అబ్బాస్ అన్నారు. మండల కేంద్రంలో సిపిఐ (ఎం) జిల్లా స్థాయి శిక్షణా తరగతుల సందర్భంగా పార్టీ జెండాను సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎండి అబ్బాస్ మాట్లాడుతూ వర్షాల వలన ధాన్యం తడిసి అ ధాన్యంను మిల్లర్లు సరిగా లేవని గిట్టుబాటు ఇవ్వకపోవడంతో రైతున్నలు అ ధాన్యంను పశువులకు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యం నిల్వలపై చెతులెత్తె ప్రయత్నం చేస్తున్నదని, ఎరువుల సబ్సిడీని నిలిపివేసి తెలంగాణపై సవితి తల్లి ప్రేమను చూపుతుందన్నారు. అపరేషన్ కగర్ ను వెంటనే నిలిపివేయాలని, వెంటనే చర్చలు జరిపి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కోరారు. మావో నంబాల కేశవరావు ఎన్కౌంటర్ అ తర్వాత మృతదేహాన్ని ఖననం చేయాలన్న కుటుంబానికి ఇవ్వం అనే విధంగా ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. ఆపరేషన్ సింధుర్ గోప్ప పరిణమం అదే విధంగా అ కేంద్ర పార్టీ వ్యక్తిగత ప్రచారంగా దేశ ప్రజల డబ్బును వృథా చేస్తు కోట్ల రూపాయలను ఖర్చు చేయడం సిగ్గు చేటన్నారు. అదే డబ్బులను టెర్రరిస్టులను ఎరి వేయడంలో ఖర్చు చేయాలని, పహల్గం నిందితులను ఇప్పటి వరకు పట్టుకోకపోవడం సిగ్గు చేటని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత వస్తువులపై 25 శాతం రుసుం విధించడం దేశ ప్రజలకు ఇబ్బందిగా మారిన మోడీ ప్రభుత్వం సమస్యలను పట్టించుకోకుండా ప్రచారలకు ఎక్కువ విలువ ఇస్తున్నారని అన్నారు .త్వరలోనే ప్రజల సహకారంతో ప్రభుత్వాల వైఫల్యాలాను ఎండగడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ జిల్లా కార్యదర్శి మొకు కనకారెడ్డి కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి రాయపర్తి రాజు, రాయపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, నాయకులు రెడ్డి, రాజుల నారాయణ, గడ్డం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వీరేశలింగం అందరికీ ఆదర్శం



**ప్రజాపక్షం/నెక్కొండ:**కందుకూరి వీరేశలింగం పంతులు ప్రస్తుత రాజకీయాల్లోని యువతకు నేతలకు ఆదర్శమని వరంగల్ జిల్లా నెక్కొండ మండల యువజన కాంగ్రెస్ నాయకులు చల్ల శ్రీపాల్ రెడ్డి అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన మా ట్లాడుతూ స్త్రీ విద్య కై పోరాడిన మహోన్నతమైన వ్యక్తిని గద్య తిక్కన అని ముద్దుగా ప్రజలు పిలుచుకునే వారని, సాహితీవేత్త అయిన కందుకూరి వీరేశలింగంపంతులు స్త్రీలకోసం ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఆయన అన్నారు. ఆయన స్మృతులు మనకు దారి చూపే గుర్తులని ఆయన అన్నారు.

## ఎందరికో రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన ఘనత ఎన్‌టిఆర్ దే



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలుగు రాష్ట్రాల్లో పలు పార్టీల్లో ఒక వెలుగు వెలుగుతున్న ఎందరో రాజకీయ నాయకులకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన ఘనత నందమూరి తారక రామారావు దేనని అఖిలభారత నందమూరి అభిమాన సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వర్గం దశరథం, దేసూ లక్ష్మణ్ అన్నారు. నందమూరి తారకరామారావు జయంతి పురస్కరించుకుని వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో నందమూరి అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్గం దశరథం దేశ లక్ష్మణ్ లు మాట్లాడుతూ, మొన్నటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఎన్టీఆర్ రాజకీయ జీవితాన్ని ప్రసాదించాలని అలాగే ఆంధ్రప్రదేశ్ మొన్నటి ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘాల అధ్యక్షుడిగా పని చేశారని వీరి ఇరువురికి తెలుగుదేశం పార్టీతో నందమూరి అభిమాన సంఘాలతో సంబంధాలు ఉన్నాయని, అలాగే నేడు ప్రస్తుతం తెలంగాణలో ఆంధ్రప్రదేశ్లో వివిధ పార్టీల్లో పనిచేస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, అందరికీ అన్న నందమూరి తారక రామారావు రాజకీయ జీవితాన్ని ప్రసాదించారని అలాంటి మహోన్నతమైన వ్యక్తి ఇక రాజకీయాల్లో రారేమో అని వారన్నారు. అన్న అంటే కరిగిపోయే మహోన్నతమైన వ్యక్తి ఎలాంటి స్వార్థం లేకుండా పేద వారి కోసం కూడు, గూడు, గుడ్డ, అనే పథకాన్ని ప్రవేశపెట్టి జనతా వస్త్రలు, పక్కగృహాలు, ఒక రూపాయికి కిలో బియ్యం, ఈ పథకాలు ఆనాడే నందమూరి తారక రాముడు ప్రవేశపెట్టారని, ముందు చూపుతో స్థానిక సంస్థల్లో ఆడపడుచుల కోసం 33 శాతం మహిళా రిజర్వేషన్లు తీసుకువచ్చిన ఘనత అన్నగారిదేనని వారు గుర్తు చేశారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నంచర్ల లక్ష్మణ చారి, కాశబోయిన మల్లయ్య యాదవ్, కాశబొయిన వెంకన్న యాదవ్, పైండ్ల రాములు, గరికపాటి రామ్ గోపాల్, సిద్ధ ఉపేందర్, నరసింహారెడ్డి కొత్త వీరారెడిపాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఎర్రబెల్లి కలిసిన మండల బిఆర్ ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/దేవరుప్పుల:**తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అమెరికా పర్యటనకు వెళ్లనున్న సందర్భంగా జూబ్లీహిల్స్ లో గల నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసిన దేవరుప్పుల మండల బిఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్,జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశం,మాజీ ఎంపిపి కోల్లురి సోమయ్య,మండల ప్రధాన కార్యదర్శి చింత రవి,మాజీ గ్రంథాలయ డైరెక్టర్ కారుపోతుల బిక్షపతి,జిల్లా యువజన నాయకులు కోతి ప్రవీణ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జీ వడ్లకోండ వినయ్, మండల యువజన నాయకులు పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకటించాలి

### ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి రమేష్




**ప్రజాపక్షం/ నర్సంపేట:** ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న ప్రభుత్వం కనీస వ్యవసాయ ప్రణాళిక ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందని, ఇప్పటికైనా తక్షణమే వ్యవసాయ ప్రణాళిక ప్రకటించి, యాసంగి సీజన్ రైతుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన బేషరతుగా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ(ఐక్య) ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం హనుమకొండ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎన్ రెడ్డి హంసా రెడ్డి అధ్యక్షతన నర్సంపేటలోని ఓంకార్ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రైతు రాజ్యం అని గొప్పగా చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని, రైతాంగం ఆరుగాలం కష్టించి యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని సరైన పద్ధతుల్లో కొనుగోలు చేయకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లర్లపై కొనుగోలు కేంద్రాలపై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్క వేయడం సరికాదన్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలతో రైతుల ధాన్యాలు తడిసి నష్టపోతున్నాయని ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని సర్క్యులర్ జారీ చేసి చేతులు దులుపుకుందే తప్ప ఎక్కడ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన పరిస్థితి లేదన్నారు. మిల్లర్లు, అధికారులు, కొనుగోలు కేంద్రాల బాధ్యులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మరోవైపు ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమై రుతుపవనాలు వస్తున్నాయని తెలిసినా ప్రభుత్వ యంత్రాంగం నేటికి క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలు, భూ సమస్యలు పరిష్కారం చేయకుండా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకటించకుండా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు, రుణాలు, పరికరాలు అందుబాటులో ఉంచి నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కుంటి సాకులతో ఆపిన రైతుల రెండు లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేసి రైతుల అకౌంట్‌లలో డబ్బులు వేయాలని, అలాగే పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా డబ్బులను తక్షణమే రైతులకు అందించే ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గుండెబోయిన చంద్రయ్య, నర్ర ప్రతాప్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, మహమ్మద్ రాజా సాహెబ్, మాలి ప్రభాకర్, సంగం రాజన్న, ఎగ్గని మల్లికార్జున్, పెరబోయిన ఐలోని తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబు మార్కుతో పుష్కరాలు విజయవంతం

### మండల కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రాజబాపు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాళేశ్వరం దైవ క్షేత్రాన్ని పర్యాటక కేందంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం ఉన్న గొప్ప నాయకుడు ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించడం దేవుడి సంకల్పమని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు లేతకారి రాజబాపు పేర్కొన్నారు.కాళేశ్వరం క్షేత్రం లో సరస్వతి పుష్కరాలు మంత్రి శ్రీధర్ బాబు కృషి ఫలితమే కుంభమేళాను తలపించాయన్నారు.పుష్కరాల సందర్భంగా సుమారు 30 లక్షల భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని, సరస్వతీ పుష్కరాలకు కనీవినీ ఎరుగని రీతిలో తరలివచ్చిన భక్త జనంతో సరస్వతి పుష్కరాలు విజయవంతం కావడానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబు మార్కుగా,నవరత్న హారతి,టెంట్ సిటీ,సరస్వతి పుష్కర ఘాట్ లపై శ్రీధర్ బాబు విజన్ గా లేతకరి రాజబాపు పేర్కొన్నారు.సరస్వతీ పుష్కరాలను విజయవంతం చేసిన ప్రభుత్వయంత్రాంగానికి ,ఐటీ ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్ రావుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,జిల్లాఎస్పీ కిరణ్ ఖరే పుష్కర విధుల్లో పాల్గొని భక్తుల సౌకర్యాల పట్ల నిరంతర సేవలు అందించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా లేతకరి రాజబాపు ధన్యావాదాలు తెలిపారు.

## కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలి

### సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కాలనీలోని సమస్యల పైన ఇంటింటి సర్వే



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కాలనీ వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాని రామన్నపేట, కరీమాబాద్ ఏరియా కార్యదర్శి సింగారపు బాబు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ కరీమాబాద్ ఏరియా ఆధ్వర్యంలో 32వ డివిజన్‌లో స్థానిక సమస్యలపైన ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంలో జ్యోతి కాలనీలో ముఖ్యఅతిథిగా రామన్నపేట, కరీమాబాద్ ఏరియా కార్యదర్శి సింగారపు బాబు పాల్గొని సమస్యలను ప్రజల అడిగితెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, మోరి నీళ్లు ఇంట్లోకి వస్తున్నాయని, వీధిలైట్లు లేవు, రోడ్డు లేకపోవడంతో రాత్రిపూట ప్రజలు కింద పడుతున్నారన్నారు. దోమలు ఎక్కువగా ఉన్నాయని, మున్సిపాలిటీ చెత్త బండి రావట్లేదు, మోరీలు నెలల కొద్ది గడిచిన తీయడం లేదని కాలనీవాసులు తెలిపారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీరన్నకుంటలో డ్రైనేజీ సమస్య, వీధిలైట్లో సమస్య కూడా ఎక్కువగా ఉన్నదని, చెత్త బండి కూడా రావట్లేదు కావున అధికారులు తక్షణమే స్పందించి కాలనీవాసుల సమస్యలు తీర్చాలన్నారు. బీరన్న కుంటలో ఉన్నటువంటి 1000 గజాల ఖాళీ స్థలంలో ప్రజలు ఫంక్షన్ హాల్ కట్టాలని కోరుకుంటున్నారన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు రూ. 5 లక్షల రూపాయలు ఇచ్చి ఇల్లు కట్టించాలని కోరారు. ఉర్సు గుట్ట బండ కార్మికులు 50 సంవత్సరాలు నుండి 150 కుటుంబాలు బండ కొట్టుకొని జీవిస్తున్నారని, వాళ్లకు పక్క ఇల్లు కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు గున్నాల ప్రభాకర్ మూడేడ్ల ఉపేందర్ అప్పాజీ వాణి బోరగాని రమ్య గన్నబోయిన వాణి, మాదాసు దివ్య, కోరే విజయ, బోరగాని రజిత, అప్పాజీ తేజ, ఎండిమాసుబి, కాళీమాతలు తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/నిజాంపేట్:నిజాంపేటమండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నూతన గ్రామ అధ్యక్షుడిగా అనుపరాజు, ఉపాధ్యక్షుడు రాములు, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అనుప రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకం ఉంచి గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమాలు చెయ్యమని పిలుపునిస్తే చేయడానికి ముందుంటానని పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే, మండల అధ్యక్షుడు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వేరువేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ప్రజాపక్షం/శివ్వంపేట:శివ్వంపేట మండలంలో ఇద్దరు వ్యక్తులు వేరువేరు ఘటనల్లో మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెలితే ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దగొట్టిముక్క గ్రామానికి చెందిన బాణాపురం కార్తిక్ అతని స్నేహితుడు యశ్వంత్‌తో కలసి బైక్‌పై 26వ తేది రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో గోమారం గ్రామానికి మార్కెట్ వెళ్తున్నారు. అయితే ప్రమాదవశావత్తు గోమారం హై స్కూల్ వద్ద వడ్లకుప్పకు ఢీ కొని ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. అయితే కార్తిక్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 27న ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి బాణాపురం నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐతెలిపారు.

## గుడినిర్మాణం చేస్తూ కిందపడి.....

మండలంలోని లింగోజిగూడతండాలో గుడి నిర్మాణం చేస్తున్న కాకినాడ జిల్లా పెద్దాపురంకు చెందిన శిరం కొండబాబు (50) కాలు జారి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాపక్షం/శివ్వంపేట : మండల కేంద్రమైన శివ్వంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో, గోమారం రైతు సంఘంలో పచ్చిరొట్ట విత్తనాలు, జిలుగు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని పిఏసిఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి తెలిపారు. వీటి బస్తా ధర రూ. 2137 ఉందని, ఒక బస్తా 30 కిలోల ఉంటుందన్నారు. ప్రస్తుతం 200 బ్యాగులు ఉందుబాటులో ఉన్నాయని, మరికొన్ని బ్యాగులు వస్తాయని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒలావణ్య, పిఏసిఎస్ వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, గోమారం మాజీ సర్పంచ్ లావణ్యమాధవరెడ్డి,సిఇఒమధు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## శబ్ద కాలుష్యం అరికట్టాలంటూ పోలీసులకు వినతి

### కాంగ్రెస్ నాయకుడు గుండ్ల మహేందర్‌రెడ్డి



ప్రజాపక్షం /జిన్నారం:రోడ్లపై శబ్ద కాలుష్యం అరికట్టాలంటూ,మైనర్‌లకు వాహనాలు నడపకుండా చూడాలని కాంగ్రెస్ నాయకుడు గుండ్ల మహేందర్‌రెడ్డి, పోలీసులకు వినతి పత్రం అందజేశారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ రోడ్లపై వాహనాల శబ్ద కాలుష్యం అరికట్టాలని, కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి పోలీసులకు వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో ట్రాఫిక్ పర్యవేక్షణ చేస్తున్న అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని ముఖ్యంగా మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బైక్ ల ద్వారా వస్తున్న పెద్ద పెద్ద శబ్దాలను గుర్తించి బైక్ లను సీజ్ చేయాలని ఆయన విన్నవించుకున్నారు. మహిళలు జనాలున్న చోటే పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ఉన్నారని బొల్లారంలో బైక్‌ల కారణంగా శబ్ద కాలుష్యం రోజు రోజుకు పెరుగుతుందని అందులో పేర్కొన్నారు. బైకులను నడిపే యువకులు , ఒకేబైక్ పై ముగ్గురు నలుగురు, వెళ్తూ పటాకులు పేల్చినట్టుగా పెద్ద శబ్దాలు చేస్తూ ఉన్నారని, ఇలాంటి వ్యక్తుకు పోలీస్ కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని ,అసలు, బైక్ నుండి ఎక్కువ శబ్దాలు పటాకుల శబ్దాలు ఏలా వస్తున్నాయో గుర్తించాలని ఈ వినతి పత్రంలో విన్నవించుకున్నారు. సైలెన్సర్ లో పేలినట్టుగా బైకులు నడుపుతూ రాత్రి పూట వెళుతున్నారు. కాబట్టి ఈ శబ్ద కాలుష్యం చేస్తున్న యువకులను ,మైనర్, పిల్లలు, నడుపుతున్న వాహనాలు, గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వారి తల్లిదండ్రులని పిలిచి మాట్లాడాలని కౌన్సిలింగ్ ఇచ్చి బైకులు సీజ్ చేయాలని ఆయన పోలీసులను కోరారు.

## రంజోల్ రైతు వేదికలో రైతు ముంగిల్లో శాస్త్రవేత్తల కార్యక్రమం



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపం లోని రంజోల్ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ,వ్యవసాయ శాఖ అధ్వర్యంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. వచ్చే వానాకాలం పంట సాగులో రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని ,రసాయనాల వినియోగం వల్ల నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని ఎరువులు ,విత్తనాలు పురుగుమందులు కొన్నప్పుడు రసీదులను భద్రపరచుకోవడం వలన కష్టకాలంలో నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందని కంది వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రర్ బసంత్ పూర్పరిశోధన విభాగం శాస్త్రవేత్త విజయలక్ష్మి లు అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే చిట్కాలను శాస్త్రవేత్తలు సూచించారు. పంట సాగులో మర్పిడి చేయడం వలన సుస్థిర ఆదాయం పొందేదకు అవకాశం ఉంటుందని తెలియజేప్పారు. విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధన ఫలితాలను రైతుల వద్దకే చేర్చేందుకు ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రైతులు కూడా తమ యొక్క సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో బసంత్ పూర్, శాస్త్రవేత్త విజయలక్ష్మి , కంది వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారి లావణ్య విస్తరణ, అధికారి ప్రదీప్ కుమార్ రైతులు , తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చరిత్ర చెరిపి వేయాలని చూస్తున్న మోదీ

### గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్



ప్రజాపక్షం/గజ్వేల్:దేశాభివృద్ధిలో దివంగత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం కాగా, నవ భారతావనికి దృఢమైన పునాది వేసిన ఆయన అడుగుజాడల్లో యువత ముందుకు సాగాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సర్దార్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్ ఆకాంక్షించారు. దిగంగత ప్రధాని జవహర్ లాల్ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కాంగ్రెస్ చరిత్ర చెరిపివేయాలని చూస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్ పై యుద్ధం విరమింపజేసి భారత సైన్యం బలమైన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసినట్లు విమర్శించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీల కుటుంబ చరిత్రను కించపరిచేలా ప్రచారం చేస్తున్న బిజెపి నేతలు పూజ్య బాపూజీ మహాత్మగాంధీని చంపిన వారు గాడ్సే వారసులని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధంలేని నరేంద్ర మోడీ, అమిత్ షా వంటి నేతలు దేశంలో కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలుగా విభజించి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే దేశాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ కు దక్కుతుందగా, దేశాన్ని దివాలా తీయించి అప్పుల ఊబిలోకి నెట్టుతున్న బిజెపి అంబానీ, అదాని కొమ్ము కాస్తూ రూ లక్షల కోట్లు కట్టబెడుతున్నట్లు తెలిపారు. పదహారేళ్లపాటు ప్రధానిగా పనిచేసిన నెహ్రూ నూతన సాంకేతికతను అందుబాటులోకి తేగా, ఆధునిక భారత్ గా తీర్చిదిద్ది అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఖ్యాతి తెచ్చి పెట్టినట్లు గుర్తు చేశారు. వ్యవసాయం, పరిశ్రమల స్థాపన, విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రణాళికలు రచించి ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, దివంగత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ కు దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో నేతలు సుఖేందర్ రెడ్డి, సత్యనారాయణ, జహీర్, కన్నా యాదవ్, సురేష్, గాడి పల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, చెప్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌లకు ముందస్తున అరెస్టు

ప్రజాపక్షం/రేగోడ్: మండల పరిదిలోని అయా గ్రామాల మాజీ సర్పంచులు మంగళవారం సర్పంచులు పెండింగ్ బిల్లులు రావాలని చలో సెక్రటేరియట్ ముట్టడికి తరలి వెళుకుండా పోలీసులు ముందస్తున అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు అప్పులు చేసి గ్రామాలా అభివృద్ధికి పనులు చేపట్టి పూర్తి చేశామని అభివృద్ధికి పాటుపడితే అప్పులో మునిగి పోయమాని అన్నారు పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచులు కోరారు అరెస్టు అయిన వారిలో సర్పంచులు నర్సిములు, సుంకే రమేష్, గురునాథ్ రవీందర్, నాయకులు సురేందర్ బాబా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గోకర్ణేశ్వర అలయంలో అన్నదానం

ప్రజాపక్షం/రేగోడు:రేగోడు మండల కేంద్రంలోని శ్రీగోకర్ణేశ్వర ఆలయం వద్ద మంగళవారం అమావాస్య సందర్భంగా మునిగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అనంతరం సర్పన అంజయులు దాంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు భజన కార్యక్రమం చేశారు పూజారి మహేష్ స్వామి అన్నారు.కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాపక్షం/నిజాంపేట్:నిజాంపేట మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలో మంగళవారం రోజున బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేయడం జరిగింది. గ్రామానికి చెందిన దుర్గొల్ల అనిత వైద్య ఖర్చులు నిమిత్తం కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడం జరిగిందని అందుకు మెదక్ ఎంపి రఘునందన్ రావు సహకారం తో 43000 రూపాయలు సిఎంఆర్ఎఫ్ చెక్ ఇవ్వడం జరిగింది. మాకు వైద్య ఖర్చుల నిమిత్తం సహకరించిన రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు , ప్రధాన కార్యదర్శి , తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### ఎఎస్ఐ జైపాల్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/నిజాంపేట్:వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిజాంపేట ఎఎస్ఐ జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సంబంధిత ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు హెల్మెట్ ధరించాలని సూచించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ నాగరాజు, నవీన్ లు ఉన్నారు.

## 31న చలో వరంగల్



ప్రజాపక్షం/నెక్కొండ:ఈనెల 31న వరంగల్ జిల్లాలో పద్మశ్రీ అవార్డు తీసుకొని తొలిసారిగా వరంగల్ నగరానికి విచ్చేయుచున్న ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం చేయనునట్టు వరంగల్ రైల్వే స్టేషన్ నుండి హనుమకొండ వరకు భారీ ర్యాలీ ఉంటుందని , అందుకోసం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో 31న జరిగే సమావేశానికి జన సమీకరణ పలు అంశాలపై జిల్లా ఎంఎస్పి అధ్యక్షుడు ప్రణయ్ దీప్, జిల్లా ఇంచార్జి మహేందర్, రాష్ట్ర నాయకులు విజయ్ మండల నాయకులు ఈదునూరి వెంకన్న, మాజీ ఎంపిటిసి,తదితరులు సమావేశం పాల్గొన్నారు.

## మండల భారతి సర్వసభ్య మహాసభ

ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లా నెక్కొండ మండల భారతి మండల సమైక్య 17వ వార్షిక మహాసభ స్థానిక రైతు వేదికలో బుధవారం జరగనుందని ఏపిఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సమైక్య మహాసభకు ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి హాజరు కానున్నారని, మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు శాసనసభ్యుడు సందేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు తప్పకుండా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన అన్నారు.

## గోసాన్‌పల్లిలో చోరీ



**ప్రజాపక్షం/దుబ్బాక:** తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగుల గొట్టి బంగారం వెండి చోరి చేశారు. ఈ ఘటన దుబ్బాక మండలం గోసాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. దుబ్బాక ప్రొబేషనరీ ఎస్ఐ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం గోసాన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ముస్వామి గ్రామంలో కిరాణం షాపు పెట్టుకునేందుకు ఇటీవల నూతనంగా రూమ్ నిర్మించుకోని పాత ఇంటికి తాళం వేసి సోమవారం కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో ఉన్నారు. మంగళవారం ఉదయం పాత ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటికి వేసి తాళం విరగొట్టి తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులో ఉన్న ముప్పావు తులం బంగారం, 15 తులాల వెండి వస్తువులు అపహరణకు గురైన్నట్లు బాధితుడు స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలాన్ని దుబ్బాక పోలీసులు పరిశీలించారు.

## ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

### జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఎల్ఆర్ఎస్ క్రమబద్దీకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై పంచాయితి కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై క్షేత్రస్థాయిలో పంచాయితి కార్యదర్శులు ప్ర భుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పొరపా ట్లు జరుగకుండా పక్కాగా వివరాలు నమోదుచే స్తూ గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నా రు. ఎక్కడా తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బ ందులు రాకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వా డకం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలనా ్నరు.సమావేశంలో డిపిఒ స్వరూ ప,ఎంపిడి ఒసంపత్‌కుమమార్,తదితరులుపాల్గొన్నారు.

## ఈనెల 30న జాబ్‌మేళా

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఈనెల జిల్లా 30న ఉపాధి కల్పనా అదికారి ఆధ్వ ర్యంలో నిర్వహించే (ప్రైవేట్ జాబ్స్) జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని కావున జనగామ జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అదికారి పి సాహితి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్స్ కాపీలతో యువతీ, యువకులు ఈనెల 30న ఉదయం 10:30 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 7995430401 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## మాజీ సర్పంచ్‌ల అక్రమ అరెస్ట్‌లు అప్రజాస్వామికం

### గంగం సతీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని మాజీ సర్పంచ్‌ల ఫోరం బచ్చన్నపేట మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేశామని ప్రభుత్వం పేపర్ ప్రకటనకే తప్ప ఇప్పటి వరకు గ్రామ పంచాయితీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇవ్వాలని హైధరాబాద్‌కు వచ్చే మాజీ సర్పంచ్‌లను ఎక్కడికి అక్కడే అడ్డుకోవడం, అక్రమంగా నిర్భంధించడం అప్రజాస్వామికమన్నారు. బడా కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లిస్తూ చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏంటని నిలదీశారు. అరెస్ట్ అయిన వారిలో వడ్డేపల్లి మల్లారెడ్డి, స్వామి, సునీత రాజుగౌడ్, కలీలా బేగం ఆజాం, భవాని శశిధర్ రెడ్డి, మధు, ప్రసాద్, తదితరులున్నారు.ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని మాజీ సర్పంచ్‌ల ఫోరం బచ్చన్నపేట మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేశామని ప్రభుత్వం పేపర్ ప్రకటనకే తప్ప ఇప్పటి వరకు గ్రామ పంచాయితీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైధరాబాద్‌కు వచ్చే మాజీ సర్పంచ్‌లను ఎక్కడికి అక్కడే అడ్డుకోవడం, అక్రమంగా నిర్భంధించడం అప్రజాస్వామికమన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

### గజ్వేల్ ఎసిపి కె నర్సింలు




**ప్రజాపక్షం/కొండపాక:** ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని గజ్వేల్ ఏసిపి కె నర్సింలు అన్నారు.మంగళవారం కుకునూరుపల్లి స్టేషన్‌ను సందర్శించారు. వర్టికల్ వారిగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సెక్షన్ ఇంచార్జ్ ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ చుట్టు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తు దారునితో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు.సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని, విపిఓ వ్యవస్థను మెరుగుపరచాలని వారంలో రెండు మూడు సార్లు గ్రామాలను సందర్శించి, ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన కొనసాగలని తెలిపారు.ముందస్తు సమాచారాన్ని సేకరించాలని, సైబర్ నేరాలు, తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఇసుక, పిడిఎస్ రైస్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శక్తిపీఠంలో సోమావతి అమావాస్య పూజలు

### భారీగా తరలివచ్చిన భక్తులు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రంలో నిర్మితమైన శ్రీ భగలాముఖి శక్తిపీఠం భారతదేశ నలుమూలల ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి శ్రీ భగలాముఖి శక్తి పీఠం అమ్మవారి యొక్క విశిష్టలు తెలుసుకొని అనేకమంది భక్తులు ప్రతి నిత్యం భక్తులు భారీ సంఖ్యలో ప్రతి నిత్యం అమ్మవారిని దర్శించుకోవడం కోసం రావడం జరుగుతుంది. మంగళవారం నాడు సోమాపతి అమావాస్య పర్వదినం సందర్భంగా శ్రీ భగలాముఖి అమ్మవారి వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ప్రాంగణంలోని యాగశాలలో వేద పండితుల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించగా ఆలయ భూ దాత పబ్బస్వరూప రమేష్ గుప్తా పలువురు భక్తులు పెద్ద ఎత్తున యజ్ఞంలో పాల్గొనగా ఆలయ ట్రస్టు చైర్మన్ ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రల వెంకటేశ్వరశర్మ, అర్చకులు కమలేష్ పండిట్ శర్మ ఆధ్వర్యంలో భగలాముఖి అమ్మవారికి మహా మంత్రహవనం మహాపూజ అర్చన పంచామృతలతో అభిషేకం హరిదార్చన హవనం పూర్ణాహుతితో విశేష పూజలతో ముగించారు. వచ్చిన భక్తులకు పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి యొక్క విశేషాలు తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవతి అమావాస్య పర్వదినంసందర్భంగా ఆలయ సమీప ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని కీర్తిశేషులు పబ్బ రామమ్మ అంజయ్య గుప్తా వారి స్మారకార్థం వారి కుమారుడు పబ్బ స్వరూప రమేష్ గుప్తా వారి కుమారుడుతాజా మాజీ జెడ్పిటిసి పబ్బస్వాతి మహేష్ గుప్తా రమాదేవి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ భగలాముఖి అమ్మవారికి మామిడి పండ్లతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులకు మామిడి పండ్లను పంపిణీ చేశారు అనంతరం అన్నదాన వితరణ చేశారు. వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని అన్న ప్రసాదాన్ని మహా ప్రసాదంగా స్వీకరించారు. భక్తులకు షామియానాలు ఏర్పాటు చేసి చల్లటి త్రాగునీరు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు జిన్నారం పెద్దగొని శివకుమార్ గౌడ్, పబ్బా మహేష్ గుప్తా, పత్రాల శ్రీనివాస్ గౌడ్, మరియు పటాన్చెరు కాంగ్రెస్ నాయకురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తివారి నందకుమార్, సతీష్, సురేష్ గుప్త, నరేందర్ రెడ్డి , కే.సుదర్శన్ గౌడ్, ఆర్. వెంకటేష్ బి.పోచగౌడ్, కొండల్ , బి.రామాగౌడ్ , త్రినేష్ గౌడ్ , సింహం, లక్ష్మీనరసయ్య, రమేష్ గుప్తా, భాస్కర్ గుప్తా భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కోలాహలంగా మారింది. కిలోమీటర్ మేర ట్రాఫిక్ వల్ల వాహనాలు నిలుపుకొని భక్తులు నడుచుకుంటూ అమ్మవారి ఆలయానికి వచ్చారు.

## డిసిఎం బోల్తా.. ఒకరికి గాయాలు

**ప్రజాపక్షం/రేగోడ్:** మండల పరిదిలోని చౌదర్పల్లి వద్ద వడ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపుతపి బోల్తా పడడంతో ఒకరికి గాయాలైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది స్థానికుల కథనం ప్రకారం చౌదర్పల్లి గ్రామంలో ఐకెపి ద్వారా కొనుగోలు చేస్తున్న వడ్లను డీసీఎం వ్యాన్ లోడ్ చేసుకొని వెంకటాపుర్ చౌరస్తాలో ఉన్న రైస్ మిల్ కు తరలిస్తుండగా అదుపుతపుతప్పి వ్యాన్ బోల్తా పడింది ఆసమయంలో డ్రైవర్ తప్ప ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు డ్రైవర్ జైపాల్‌కు స్వల్పగాయాలు కాగా నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## రోడ్డు పక్కకు ఒరిగిన లారీ; తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం/రేగోడ్:** మండల పరిదిలోని మర్పల్లి మధ్య బ్రిడ్జ్ నిర్మాణం కోసం వదిలేసిన రోడ్డులో మంగళవారం లారీ రోడ్డు పక్కకు దూసుకుపోయింది లారీ డ్రైవర్ అప్రమత్తతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు రోడ్డుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు దాదాపు 8ఏళ్లుగా బ్రిడ్జ్ నిర్మాంచక పోగా రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు చిన్న పంటి వర్షం పడిన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు ఇటీవలే మంత్రి దామోదర్ రాజనర్సింహ బిడ్జ్ నిర్మాణం కు నిధులు మంజూరు జరిగాయని పనులు కూడా జరుగుతాయని తెలిపిన కాంట్రాక్టర్ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి నిధులు ఉన్న బిడ్జ్ నిర్మాణం చేయక పోవడం పై ప్రయాణికులు ఆవేదన చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రోడ్డుపనులు కొనసాగించాలని పజలు కోరుతున్నారు.

## వండ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పను ఢీ కోని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మునిగడపలో సోమవారం అర్థ జరిగింది. ఇటీక్యాల గ్రామానికి చెందిన బాల్‌నర్సయ్య(52) అనే వ్యక్తి తిగుల్‌నర్సాపూర్ వెల్తున్న క్రమంలో మునిగడప ప్రాథమీక పాఠశాల సమీపంలో రోడ్డుపై ఉన్న వడ్ల కుప్పను ఢీకోని సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు రాకుండా కొందరు మద్య వర్తులు సంబంధిత రైతు నుండి రూ. 2 లక్షలు మృతుని కుటుంబానికి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.

## కుకునూరుపల్లి ఎంఆర్‌సికి చేరిన పాఠ్యపుస్తకాలు



**ప్రజాపక్షం/కొండపాక:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలకు మంగళవారం చేరుకున్నాయి.పాఠశాలలకు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.బుధవారం ఉన్నత పాఠశాలల వారికి గురువారం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు అందించి పాఠశాలలు చేరవేయనున్నట్లు ఎంఈఓ బచ్చలి సత్తయ్య తెలిపారు.పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులందరికి ఉచితంగా పుస్తకాలు అందుతాయన్నారు.

## వైరామాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతి

### సంతాపం తెలిపిన జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** వైరా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి బానోత్ మదన్ లాల్ ఏఐజీ ఆసుపత్రిలో గుండెపోటుతో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతిపట్ల జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. నిరంతరం ఆయన ప్రజాసేవకు పరితపించారని, ఆయన సేవలు నియోజకవర్గ ప్రజలలో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.